క్లుప్తంగా

రేపటి నుంచి రెంటచింతలలో గడప గడపకు మన ప్రభుత్వం

రెంటచింతల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మండల కేంద్రమైన రెంటచింతలలో ఈ నెల 8వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు పల్నాడు జిల్లా అభివృద్ధి అధికారి, మండల ప్రత్యేక అధికారి యల్లా మహాలక్ష్మి బుధవారం తెలిపారు. ప్రభుత్వ విప్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సూచనల మేరకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం అమలుచేస్తున్న వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి ఎంత మేర లబ్ధి చేకూరిందో వివరించను న్నట్లు తెలిపారు. ప్రతి రోజు సాయంత్రం 5.30 గంటలకు చేపట్టనున్న ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి వెంట వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు, స్థానిక ప్రజా ప్రతినిధులు, పార్టీ నేతలు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారి వివరాలను తెలుసుకుని వారికి ఆయా సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన తెలిపారు.

గ్రామ దేవతకు బోనాల సమర్పణ


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కారెంపూడి: మండలంలోని చింతపల్లి గ్రామ దేవత పాతపాటేశ్వరమ్మ అమ్మవారి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం బుధవారం జరిగింది. గ్రామ మహిళలు నిష్ఠతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయం చేరుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి బోనాలు సమర్పించారు. గ్రామస్తులు గ్రామ దేవతను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. గ్రామ పెద్దలు కార్యక్రమ నిర్వహణలో పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌పై సమీక్ష సమావేశం

గురజాల: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ వారి ఆదేశాల మేరకు గురజాల మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సీనియర్ సివిల్ జడ్జి బీఎల్వీ శేషాద్రి అధ్యక్షతన ఎక్సైజ్, పోలీస్ శాఖ, న్యాయ వాదులకు జాతీయ లోక్ అదాలత్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి శేషాద్రి మాట్లాడుతూ పది లీటర్ల పరిధి వరకు లిక్కర్, బీర్లు పట్టుబడ్డ కేసులలో వాటి విలువకు మూడు నుంచి ఐదు రెట్ల వరకు చెల్లించి సదరు కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవలసినదిగా కక్షిదారులకు సూచించాలన్నారు. అలాగే ఎక్సైజ్ అధికారులు, పోలీసు వారు సదరు కేసులలో ముద్దాయిలకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు గాను వారికి అవగాహన కలిగించి కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించాల్సిందిగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డి.షర్మిల, జానీబాషా, ఎక్సైజ్, పోలీస్, న్యాయవాదులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల దొంగల అరెస్ట్



వినుకొండ(నూజెండ్ల): పలు ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్‌లను పగలగొట్టి కాపర్‌వైర్‌లను దొంగిలించే ప్రకాశం జిల్లాకు చెందిన నలుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ జి.అనిల్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఐనవోలు పోలీస్‌స్టేషన్ వద్ద బుధవారం జరిగిన సమావేశంలో ఎస్‌ఐ అనిల్‌కుమార్ మాట్లాడుతూ నూజెండ్ల మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో గుండ్లకమ్మ వాగు బ్రిడ్జి వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆటోలో నలుగురు వ్యక్తులు మూడు గోతాల్లో కాపర్ అచ్చులను, సర్వీసు వైర్ ముక్కలను తీసుకొని ఉప్పలపాడు గ్రామం వైపు నుంచి వినుకొండ వైపు వెళ్తుండగా వారిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. విచారించగా ప్రకాశం జిల్లాకు చెందిన రాసిగిరి శ్రీను, వాగులూరి సుధాకర్, వాగులూరి సంసోన్, పోలా అంకాలు నలుగురు కలిసి నూజెండ్ల, బొల్లాపల్లి, వినుకొండ, సంతమాగులూరు, బల్లికురవ, అద్దంకి పరిసర ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లను పగలగొట్టి కాపర్‌వైర్‌ను దొంగిలించే వారిగా గుర్తించినట్లు తెలిపారు. వారిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు వివరించారు.

కళాశాల ఉన్నతికి తోడ్పాటు


పూర్వ విద్యార్థులు అందజేసిన ఆధునిక కంప్యూటర్స్


పూర్వ విద్యార్థులు అందజేసిన రైటింగ్ ప్యాడ్ కుర్చీలు

ఉన్న ఊరిని, కన్నతల్లిని మరువకూడదన్న నానుడిని నిజం చేశారు ఓ కళాశాల పూర్వ విద్యార్థులు. ఉద్యోగ, వ్యాపార రంగాలలో దేశ విదేశాల్లో స్థిరపడినా తమ ఉన్నతికి తోడ్పాటు అందించిన కళాశాలను మరువలేదు. తాము చదువుకున్న కళాశాల అభివృద్ధికి తాము సంపాదించిన దానిలో కొంత కేటాయిస్తున్న పూర్వ విద్యార్థుల స్ఫూర్తిని పలువురు కొనియాడుతున్నారు.

- కళాశాల పూర్వవైభవం కోసం
- పూర్వ విద్యార్థుల అపూర్వ సహాయం
- రూ. 15 లక్షల విలువైన మౌలిక సదుపాయాలు

మాచర్ల రూరల్: 57 సంవత్సరాలుగా ఎంతో మంది విద్యార్థులకు ఉన్నత విద్యను అందిస్తూ వారి ఉన్నతికి బాటలు వేసింది వెనుకబడిన పల్నాటి ప్రాంతంలో ప్రముఖ ప్రభుత్వ కళాశాలగా గుర్తింపు పొందిన శ్రీకాసు బ్రహ్మానందరెడ్డి డిగ్రీ కళాశాల. ఈ కళాశాల పూర్వ వైభవానికి కొందరు పూర్వ విద్యార్థులు నడుం బిగించారు. 1977, 1983 సంవత్సరాలలో ఇంటర్, డిగ్రీ విద్యను పూర్తి చేసుకున్న అప్పటి విద్యార్థులు నేడు ఉద్యోగ, వ్యాపారాలలో ఉన్నత స్థానాలలో తమను నిలబెట్టిన కళాశాలలో మౌలిక సదుపాయాల పట్ల గ్రూపుగా ఏర్పడ్డారు. ఈ నేపథ్యంలో సుమారు రూ. 15లక్షల వ్యయంతో కళాశాలకు సౌకర్యాలు కల్పించేందుకు శ్రీకారం చుట్టారు. పేద, బడుగు, బలహీన వర్గాలు చదువుకునే కళాశాలలో విద్యార్థుల కోసం ఆధునిక టెక్నాలజీతో 10 కంప్యూటర్స్, 150 రైటింగ్ ప్యాడ్ కుర్చీలు అందించారు. అలాగే తరగతి గదుల మరమ్మతులతో పాటు కరెంట్ వైరింగ్ కూడా చేయిస్తున్నారు. నూతన రంగులు వేయిస్తూ కాలేజీకి నూతన శోభను తీసుకొస్తున్నారు. ఇదే కళాశాలలో ఇంటర్, డిగ్రీ చదువుకొని నేడు ప్రతిష్టాత్మకమైన పోలవరం డ్యాం చీఫ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న బుర్రి సుధాకర్‌బాబు రూ. 5లక్షలను విరాళంగా అందించారు. అలాగే కొడాలి రాజేంద్రప్రసాద్ రూ. 50వేలు, ఎంఈఓ వేముల నాగయ్య, ఆదర్శ పబ్లిక్ స్కూల్ వ్యవస్థాపకులు కోలా అమర్ జ్యోతి జ్ఞాపకార్థం యూనస్ రూ. 25వేలు, కేసీపీ ఎలక్ట్రికల్ ఇంజనీర్ కేవీ దుర్గా ప్రసాద్, రిటైర్డ్ డీఎస్‌పీ కె.ప్రకాశరావు, ఉపాధ్యాయుడు రామరాజు చంద్రశేఖర్, నట్టువ రామకృష్ణ, రఘువర్ధన్, మోరా భాస్కర్‌రెడ్డి, గాదె కిరీటిరెడ్డి, జిల్లా వైద్యాధికారి బండారు సుబ్బారావు, రిటైర్డ్ డిప్యూటీ డీఈఓ గాదె రామకృష్ణారావు, ఉప్పుతోళ్ళ రమేష్ కళాశాలకు విరివిగా భారీ విరాళాలను అందించారు. ఈ నెల చివరిలో నాక్ బృందం విజిట్ చేయనున్న నేపథ్యంలో కళాశాలకు ఈ అదనపు సౌకర్యాలను కల్పించి గ్రేడ్ ఏ సాధించి కళాశాలలో అదనపు కోర్సులు తీసుకొచ్చేందుకు పూర్వ విద్యార్థులు అందిస్తున్న సహకారాన్ని పలువురు అభినందిస్తున్నారు.

ఉన్నత స్థాయికి కళాశాలే పునాది



వెనుకబడిన పల్నాటి ప్రాంతంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యను అందుకోవటం వల్లనే నేను ఈ స్థానంలో ఉన్నాను. నా లాగే నేటి తరం విద్యార్థులు ఆధునిక, సాంకేతిక విద్యను అందుకోవాలన్న లక్ష్యంతో నా వంతుగా రూ.5లక్షల విరాళం అందించాను. అదనపు సౌకర్యాలు కల్పించేందుకు మరికొంతమందిమి కలిసి విరాళం అందిస్తాం.

బుర్రి సుధాకర్ బాబు,
పోలవరం డ్యాం చీఫ్ ఇంజనీర్

టీంగా పనిచేస్తున్నాం



1977–83 మధ్య విద్యనభ్యసించిన అందరం టీంగా ఏర్పడ్డాం. కళాశాల అభివృద్ధి కోసం చేయూతనందిస్తున్నాం. విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమనే స్ఫూర్తితో పనిచేస్తున్నాం. స్పందిస్తున్న పూర్వ విద్యార్థుల స్పందన అభినందనీయం.

ఎంఈఓ వేముల నాగయ్య

పూర్వ విద్యార్థుల కృషి అమూల్యం



ఎంతో మందికి ఉన్నత విద్యనందించి వారి ఎదుగులకు కారణమైన కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు అందిస్తున్న కృషి అమూల్యం. ఇదే స్ఫూర్తితో అందరినీ కలుపుకొని పోయి మరింత ముందుకు తీసుకుపోతాం.

కుర్రి సాయి మార్కొండారెడ్డి,
పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్

బడుగు కుటుంబాలకు అండగా కళాశాల



ఉమ్మడి జిల్లాలో ఏకైక ప్రభుత్వ కళాశాలగా ఉండి ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న మాలాంటి కుటుంబాలకు ఈ కాలేజిలో ఇంటర్ విద్య భవిష్యత్‌కు పునాది వేసింది. అందుకే కళాశాల ఋణం తీర్చుకునేందుకు చేయూతనందిస్తున్నాం.

దుర్గా ప్రసాద్, కేసీపీ,
రిటైర్డ్ ఎలక్ట్రికల్ చీఫ్ ఇంజనీర్

భవిష్యత్ తరాలకు దిక్సూచి ఉపాధ్యాయులే


వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ అధ్వర్యంలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం


లయన్స్ క్లబ్ ఆఫ్ పల్నాడు అధ్వర్యంలో ఉపాధ్యాయులకు సన్మానం


జిగురు చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న కలెక్టర్ శివశంకర్, డీఈవో శామ్యూల్

- ఉపాధ్యాయుల సేవలు ఎనలేనివి...
- మున్సిపల్ వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావు

వెల్దుర్తి: ప్రతి ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థి అని, భవిష్యత్ తరాలను గొప్పగా తీర్చిదిద్దటంలో ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిదని మున్సిపల్ వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావు, వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ అధ్యక్షులు ఓరుగంటి చెన్నకేశవరావులు అన్నారు. బుధవారం మాచర్ల పట్టణంలోని ఆర్యవైశ్య వృద్ధాశ్రమంలో జరిగిన ఉపాధ్యాయ సన్మాన కార్యక్రమంలో పలువురిని శాలువాలతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రుల తరువాత ఉపాధ్యాయులు విద్యార్థుల బంగారు భవితకు బాధ్యత వహిస్తారన్నారు. ఉపాధ్యాయులు నిత్యం విద్యార్థుల అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షులు తిరివీధి వెంకట నాగేశ్వరరావు, జోన్ చైర్మన్ నాగేశ్వరరావు, సెక్రటరీ పందిరి నరసింహారావు, ప్రొఫెసర్ భవనారి సత్యనారాయణ, వాసవి క్లబ్ వనితా చెన్నకేశవ అధ్యక్షురాలు మేడా వెంకట లక్ష్మి, చుండూరు సత్యనారాయణ, నేరెళ్ళ నాగేశ్వరరావు, పరిటాల ధనలక్ష్మి, గిరిజ, విడేల హరీష్, పద్మావతి, ముప్పవరపు నాగార్జున, జేవీకేఎస్ ప్రసాద్, సామ్రాజ్యం తదితరులున్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా చంద్రశేఖర్

రెంటచింతల: మండలంలోని రెంటాల ఎంపీపీఎస్ (ఓల్డ్ యూపీ) పాఠశాలలో ఎస్‌జీటీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న జిగురు చంద్రశేఖర్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా నరసరావుపేటలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్, డీఈవో శామ్యూల్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. 2001 డీఎస్సీ ద్వారా ఎంపికైన చంద్రశేఖర్ వివిధ పాఠశాలల్లో 21 సంవత్సరాల పాటు వృత్తిపట్ల అంకితభావంతో విద్యార్థులను విజ్ఞానవంతులను చేయడంలో ఆదర్శంగా నిలిచారు. చంద్రశేఖర్ ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు తీసుకోవడంపై మండల విద్యా శాఖాధికారులు వేముల నాగయ్య, వై.శివ నాగేశ్వరరావు, మండల యూటీఎఫ్, ఎస్‌టీయూ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

ఉపాధ్యాయులకు సన్మానం

వెల్దుర్తి: మాచర్ల పట్టణంలోని పత్తి ఫ్యాక్టరీ ఆవరణలో చక్రధర్ డిగ్రీ, పీజీ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని లయన్స్ క్లబ్ ఆఫ్ పల్నాడు వారి అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం ఉదయం జరిగిన సన్మాన కార్యక్రమంలో ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి సన్మానించారు. అనంతరం లయన్స్ క్లబ్ గవర్నర్ అడ్వైజర్ చుండూరు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు ఉత్తమ విద్యనందించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి ఉన్నతంగా ఎదిగేందుకు ఉపాధ్యాయుని కృషి ఎనలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, ఉపాధ్యాయులు పల్సూరి అంజనేయులు, సంతోష్‌కుమార్, అనిల్‌కుమార్, సాగి శివప్రసాద్, యూనస్‌బేగం, ఆదిలక్ష్మి, సైదారావు, రంగారావు, సుభాని, ఆలేటి కిషోర్, శ్రీనివాసాచారి, శివనాగలక్ష్మిలను రిటైర్డ్ డిప్యూటీ డీఈఓ రామకృష్ణారావు, ప్రిన్సిపాల్ లక్ష్మీకుమారి, మున్సిపల్ కమిషనర్ ఈవీ రమణబాబు, అధ్యక్షులు విడేల శ్రీనివాసరావు, బత్తుల ఏడుకొండలు, వెంకటేశ్వర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డిలు ఘనంగా సన్మానించారు.

గోవిందుడు అందరివాడేలే


జెట్టిపాలెం గ్రామంలో ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చిన శ్రీకృష్ణ పరమాత్ముడు

ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి

పిడుగురాళ్ల: లోక కల్యాణం కోసమే కృష్ణుడు జన్మించాడని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ, రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షులు జంగా కృష్ణమూర్తి అన్నారు. పట్టణంలోని గంగమ్మ తల్లి దేవస్థానం వద్ద దేవస్థాన కమిటీ అధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ, రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షులు జంగా కృష్ణమూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణుడు అందరి వాడని, ఆయన లోక కల్యాణం కోసం జన్మించి ప్రతి ఒక్కరిని ఆదుకున్నాడని అన్నారు. పట్టణంలోని గంగమ్మ తల్లి సెంటర్‌లో యాదవ సోదరులు ఇలా కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించటం ఎంతో ఆనందదాయకమని ఆయన తెలియజేశారు. కృష్ణుడిలా ముఖ్యమంత్రి కూడా పేదల కోసం పరితపించిపోతుంటారని ఆయన తెలియజేశారు. యాదవ సోదరులంతా ముఖ్యమంత్రి చేస్తున్న మేలును అందిస్తున్న సంక్షేమ పథకాలను గుర్తు పెట్టుకొని మరలా రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించుకోవాలని ఆయన తెలియజేశారు. యాదవ సోదరులు అందరూ కలసికట్టుగా దేవాలయం అభివృద్ధికి కృషి చేయాలని ఆయన తెలియజేశారు. గంగమ్మ తల్లి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తికి పూర్ణ కుంభంతో ఆహ్వానం పలికారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమంలో ఎమ్మెల్సీ పాల్గొని యాదవ సోదరులను మరింతగా ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కౌన్సిలర్ కొక్కెర శ్రీను, కొక్కెర కొండలు, యలగాల రామారావు, శీలం రోశయ్య, యాదవ యూత్ ప్రెసిడెంట్ పుల్లారావు యాదవ్, కొక్కెర పెద కొండలు తదితరులు పాల్గొన్నారు.

ప్రబోధ సేవా సమితి అధ్వర్యంలో

జెట్టిపాలెం(రెంటచింతల): మండలంలోని జెట్టిపాలెం గ్రామంలో ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల దివ్య ఆశీస్సులతో ప్రబోధ సేవా సమితి చిలకలూరిపేట శాఖ అధ్వర్యంలో బుధవారం కృష్ణాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉదయం 7 గంటలకు స్వామివారికి పూజా జ్ఞానసత్సంగం, భగవద్గీత పఠనము నిర్వహించారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి స్వామివారి ప్రతిమను ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. మేళతాళాలు, మహిళా భక్తులు కోలాట ప్రదర్శన కార్యక్రమం స్వామివారి ఊరేగింపులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆ వేడుకలలో ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక చిలకలూరిపేట అధ్యక్షులు యద్దనపూడి వీరాంజనేయులు, సభ్యులు చిర్రా వెంకటరామిరెడ్డి, గంగయ్య, యద్దనపూడి రామాంజనేయులు, స్వర్ణ, నరేంద్ర, వై.సతీష్, మేకల వెంకటేష్ తదితరులున్నారు.

దాచేపల్లిలో..

దాచేపల్లి: శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు మండలంలో బుధవారం జరిగాయి. కారెంపూడి రోడ్డులో కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరణ చేసిన వేదికపై శ్రీకృష్ణుడి విగ్రహం ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. శ్రీకృష్ణుడి జీవితచరిత్ర గురించి పలువురు వివరించారు. దాచేపల్లిలోని అచ్చాలగడ్డలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు జరిగాయి. ఉట్టికొట్టే పోటీలు నిర్వహించారు.

మండలంలో శ్రీ కృష్ణాష్టమి

మాచవరం: మండలంలోని చెన్నాయపాలెం, మోర్జంపాడు, కొత్తగణేశునిపాడు గ్రామాల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్‌లు కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయా గ్రామాల్లో ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించగా, ఉట్టి కొట్టేందుకు యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందించారు. ఆయా గ్రామాల్లోని దేవాలయాల వద్ద ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.


కృష్ణాష్టమి వేడుకల్లో ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, జెడ్పీటీసీ జంగా వెంకట కోటయ్య


ఉట్టి కొడుతున్న ఎంపీపీ బూడిద శ్రీనివాసరావు


దాచేపల్లిలో కృష్ణాష్టమి వేడుకలు

మాచర్లలో..

వెల్దుర్తి: మాచర్ల పట్టణంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ ఆవరణలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీపీ బూడిద శ్రీనివాసరావు హాజరై ఉట్టికొట్టే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది మాచర్లలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలను జరుపుకోవటం సంతోషంగా ఉందన్నారు. నియోజకవర్గంలోని యాదవ సామాజిక వర్గానికి చెందిన వారందరూ ఈ వేడుకలను ఘనంగా జరుపుకుంటున్నారన్నారు. అనంతరం ఎంపీపీ బూడిద శ్రీనివాసరావు ఉట్టికొట్టారు. ఆనందోత్సాహాల మధ్య ఈ కార్యక్రమం జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కామనబోయిన కోటయ్య, ఏఎంసీ గొర్రె వెంకటేశ్వరరావు, రిటైర్డ్ డిప్యూటీ డీఈఓ గాదె రామకృష్ణారావు, భైరవునిపాడు సర్పంచ్ జింకల వెంకటేశ్వర్లు, జింకల నాగేశ్వరరావు, మాచర్ల రూరల్ ఎస్‌ఐ రాజశేఖర్ సభ్యులు పాల్గొన్నారు.

బాధతో... సంతోషంతో


1995-96 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

- అపురూప ఆత్మీయ బంధం ఒక్కటైన వేళ
- అలనాటి జ్ఞాపకాలలో ఓలలాడుతూ

గురజాల: స్నేహితులంతా ఒక్కటైతే ఆ జ్ఞాపకాలకు కొదవే ఉండదు. అంతేకాదండోయ్ ఇంకా చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకోవటమంటే మరీ సరదాగా సాగిపోతుంది. రోజు ఎలా గడిచిందో తెలియదు. చిన్నతనంలో చేసిన చిలిపి అల్లర్లు గుర్తు చేసుకొని ఆ జ్ఞాపకాల జీవితంలో రోజంతా గడిపితే ఆ రోజు జీవితంలో గుర్తుండిపోతుంది. అంతే కాకుండా చిన్ననాటి జ్ఞాపకానుభూతులు ఎప్పటికీ మరిచిపోకుండా ఉండేందుకు మరోసారి గుర్తు చేసుకుంటూ మరలా మరలా కలుసుకునేలా ఆ జ్ఞాపకాలు ఆ స్నేహితులను కట్టిపడేస్తాయి. పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో 1995–96 పూర్వ విద్యార్థులు అంతా ఆత్మీయ కలయిక నిర్వహించుకున్నారు. ఎక్కడెక్కడో ఉద్యోగాలు చేసుకునేవారంతా వచ్చి ఉదయం టిఫిన్ చేస్తూ ఓ జ్ఞాపకం, మధ్యాహ్నం భోజనం చేస్తూ మరో అనుభూతి, ఆటలాడుకుంటూ చిన్ననాటి చిలిపి అల్లర్లను గుర్తు చేసుకుంటూ రోజు గడిపి తిరుగు ప్రయాణంలో అందరినీ విడిచిపోతున్నామనే బాధతో వీడ్కోలు పలుకుతూ మరలా కలుసుకుంటామనే ఆనందంతో ఎవరి గూటికి వారు వెళ్లిపోయారు. ఆటలలో గెలుపొందిన వారికి బహుమతులను అందజేసుకొని బై బై అంటూ ఇంటి దారి పడుతూ కన్నీటి పర్యంతమయ్యారు.

నేడు కొత్తగణేశునిపాడులో గడప గడపకు మన ప్రభుత్వం

మాచవరం: మండలంలోని కొత్తగణేశునిపాడు గ్రామంలో నేడు (గురువారం) గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చౌదరి సింగరయ్య, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లక్ష్మిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో గురజాల శాసనసభ్యుడు కాసు మహేష్‌రెడ్డి పాల్గొని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తారని తెలిపారు. కావున మండలంలోని ప్రజా ప్రతినిధులు, మండల నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేత్రదానంపై అవగాహన


దొడ్లేరు(క్రోసూరు): అన్నిదానాల్లోకెల్లా నేత్రదానం ఎంతో గొప్పదని మండల పీహెచ్‌సీ ఆరోగ్యవిస్తరణాధికారి శిఖా శ్యాంసన్ అన్నారు. బుధవారం స్థానిక సచివాలయంలో నిర్వహించిన ఆరోగ్య సదస్సులో శ్యాంసన్ పాల్గొని మాట్లాడారు. ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8వ తేదీవరకు 38వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకుని నేత్రదానం అనే అంశంపై అవగాహన కల్పించారు. చనిపోయిన తరువాత కూడా చేయగల దానం నేత్రదానం మాత్రమేనని తెలిపారు. ప్రజల్లో ఉన్న రకరకాల మూఢ నమ్మకాలు నేత్రదానానికి అడ్డుగా ఉన్నాయన్నారు. హెచ్ఐవీ, మెదడువాపు, బ్లడ్ క్యాన్సర్, కంటి వ్యాధులున్నవారు నేత్రదానానికి అర్హులు కాదన్నారు. సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ నేత్రదానం చేయాలని, నేత్రదానం చేసే దాతలు గుంటూరు జీజీహెచ్‌లోని నేత్రదాన విభాగంలో సంప్రదించాలన్నారు.

ఔదార్యం చాటిన చిలుకా కుటుంబీకులు

అచ్చంపేట: ఇంటిపేరుగల వ్యక్తులు ముగ్గురు ఒకేసారి రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, రెండు తెలుగు రాష్ట్రాల్లో చిలుకా ఇంటిపేరున్న వారంతా వాట్సాప్‌లో గ్రూపుగా ఏర్పడి సేకరించిన రూ.40వేల నగదును బాధిత కుటుంబ సభ్యులకు బుధవారం అందజేశారు. వివరాలలోకి వెళితే మండలంలోని చెరుకుంపాలెం గ్రామానికి చెందిన చిలకా మరియమ్మ, ఆమె భర్త సునీల్, తమ్ముడు కిరణ్‌లు ముగ్గురూ జూలై 27న చెరుకుంపాలెం నుండి అచ్చంపేటకు ఒకే బైకుపై వస్తుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో మరియమ్మ, సునీల్ అక్కడిక్కడే మృతి చెందగా కిరణ్ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం తెలిసిందే. తల్లిదండ్రులు మరియమ్మ, సునీల్‌లు మృతిచెందడంతో ఆమె ముగ్గురు పిల్లలు అనాథలుగా మిగిలిపోయారు. దీంతో చిలుకా ఇంటిపేరుగల కుటుంబీకులు వాట్సాప్‌లో, ఫేస్‌బుక్‌లో పోస్టింగ్‌లు పెట్టడంతో తెలుగు రాష్ట్రాల్లో ఉన్న చిలుకా కుటుంబీకులంతా రూ.40వేలు వసూలు చేసి పంపారు. వట్టిచెరుకూరు ఎంపీపీ చిలుకా సుబ్బారావు తన వంతుగా రూ.10వేలు పంపారు. ఈ మొత్తాన్ని వేల్పూరు గ్రామానికి చెందిన చిలుకా నాగేశ్వరరావు, లక్ష్మయ్యల ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి అందజేశారు.

పనిచేసే ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం

రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు


సత్తెనపల్లి 18వ వార్డుకు చెందిన వారికి పార్టీ కండువా కప్పుతున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి(ముప్పాళ్ళ): వైఎస్సార్ సీపీలో కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు గౌరవం, సముచితస్థానం లభిస్తుందని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. పట్టణంలోని 18వ వార్డుకు చెందిన టీడీపీ నాయకుడు షేక్ ఖాసింపీరా తనయులకు పార్టీ కండువా కప్పి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానించారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ స్థానిక నాయకులతో కలిసి పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేయాలని సూచించారు. షేక్ ఖాసింపీరా, కుమారులు రోహిత్‌బాషా, రియాజ్‌బాషా వారి అనుచరులకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు పక్కాల సూరిబాబు, వార్డు నాయకులు తోట వెంకటేశ్వర్లు, పట్టణ కన్వీనర్ సహారా మౌలాలి, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ నాగూర్‌మీరాన్, నియోజకవర్గ నాయకులు పక్కాల సూరిబాబు, స్థానికులు మెహబుల్లా, సయ్యద్ హుస్సేన్, సాయి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు క్రీడాపోటీలు

నకరికల్లు: ఉపాధ్యాయులకు ఆటవిడుపుగా క్రీడలు కూడా అవసరమని ప్రధానోపాధ్యాయురాలు షేక్ పాహీం అన్నారు. మండలంలోని చేజర్ల గ్రామంలోని ఉన్నతపాఠశాల ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మంగళవారం క్రీడాపోటీలు నిర్వహించి బుధవారం బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులు భావితరాలకు ఆదర్శంగా ఉండాలన్నారు. విద్యార్థులు ఉన్నత విలువలతో కూడిన వ్యక్తిత్వంతో ఎదిగితే అది ఆ ఉపాధ్యాయునికి గౌరవం తెచ్చిపెడుతుందని అన్నారు. ఉపాధ్యాయులకు వేర్వేరుగా మ్యూజికల్ చైర్స్, స్లో సైక్లింగ్, షాట్‌పుట్, వాకింగ్ తదితర క్రీడాపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు ఎస్.లలిత, చెరుకూరు వెంకటేశ్వరరావు, షేక్ మస్తాన్‌వలి, గేరా మోహన్‌రావు, ఏసీహెచ్ వెంకట్రావు, బత్తుల సుందరరావు, షేక్ గౌస్ పాల్గొన్నారు.

20న భక్తిగీతాల పోటీలు

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ రూరల్ మండలంలోని దొండపాడు గ్రామంలో శ్రీ నిదానంపాటి శివలక్ష్మి అమ్మవారి 15వ తిరునాళ్ల మహోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 20వ తేదీన భక్తిగీతాల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలి పారు. మరిన్ని వివరాలకు 9676259830 నంబరును సంప్రదించాలని కోరారు.